సాక్షి మెదక్

మంగళవారం, 14, జనవరి, 2025

ముగ్గులు వేస్తున్న యువతులు, చిన్నారులు



న్యూస్‌రీల్

సంక్రాంతి శుభాకాంక్షలు



ఉదయ్‌కుమార్‌రెడ్డి ఎస్పీ

మెదక్‌ మున్సిపాలిటీ: జిల్లాలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో సంక్రాంతి పర్వదిన వేడుకలు జరుపుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్‌శాఖ తరుపున ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రజలందరికీ ప్రశాంతత, ఆనందం, విజయాన్ని అందించాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని, ఇతరులకు హాని కలిగించకూడదని సూచించారు.

ఆనందంగా జరుపుకోవాలి: పద్మారెడ్డి



ప్రజల జీవితాల్లో సంక్రాంతి సుఖ సంతోషాలు నింపాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఇంటా భోగ భాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోవాలని.. పిల్లలు గాలిపటాలు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

అదనపు కలెక్టర్‌ పూజలు



పూజలు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్‌ నగేశ్‌

హవేళిఘణాపూర్‌(మెదక్‌): శివుడి ఆశీస్సులతో ప్రజలు ఆయురారోగ్యాలతో చల్లంగుండాలని అదనపు కలెక్టర్‌ నగేశ్‌ ఆకాంక్షించారు. సోమవారం మండల పరిధిలోని ముత్తాయికోట సిద్దేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరమశివుడిని ఆరాధిస్తే అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని అన్నారు.

సికింద్లాపూర్‌ ఆలయానికి రూ. 4.77 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్‌): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్‌ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి వేలం పాటల ద్వారా రూ. 4.77 లక్షల ఆదాయం సమకూరింది. ప్రసాదాల అమ్మకం కోసం గోమారం గ్రామానికి చెందిన గంగిరెడ్డి వీరారెడ్డి 2 లక్షల 57 వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. కొబ్బరికాయల అమ్మకం కోసం దౌల్తాబాద్‌కు చెందిన చెట్టుపల్లి వెంకటేష్‌గౌడ్‌ రూ. 2 లక్షల 20 వేలకు వేలం పాట పాడి దక్కించుకున్నారు. గతేడాది ప్రసాదాల విక్రయం లక్షా 60 వేలు, కొబ్బరికాయల విక్రయం రూ. లక్షా 70 వేలు పలకగా, ఈసారి రూ. లక్షా 47 వేల ఆదాయం అదనంగా ఆలయానికి వచ్చింది. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌ రంగారావు, ఆలయ ఈఓ శశిధర్‌, ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, జూనియర్‌ అసిస్టెంట్లు నర్సింహారెడ్డి, సత్యజిత్‌, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

పాపన్నపేట(మెదక్‌): పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం ఏడుపాయలలో వన దుర్గమ్మకు పల్లకీ సేవ నిర్వహించారు. మొదట అమ్మవారి మూల విరాట్‌కు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి రాజగోపురం మీదుగా గోకుల్‌షెడ్డు వద్దకు పల్లకీ సేవ నిర్వహించారు. దారి పొడవునా భక్తులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్‌, శ్యాం, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాకటౌన్: పట్టణంలోని గురుకుల పాఠశాలలో 5 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ సుజాత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులకు ఫిబ్రవరి 1వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

నత్తనడకన ఎల్‌ఆర్‌ఎస్‌

- జిల్లావ్యాప్తంగా 10,182 దరఖాస్తులు
- పరిశీలించినవి 1,430 మాత్రమే..

ల్యాండ్‌ రెగ్యులరైజేషన్‌ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్‌) ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. జిల్లాలో దరఖాస్తుల పరిశీలన అనుకున్నంత వేగంగా జరగడం లేదు. ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి ప్రక్రియను వేగిరం చేయాలని ఆదేశించినా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు.



మెదక్‌లో కొనసాగుతున్న ఎల్‌ఆర్‌ఎస్‌ ప్రక్రియ

మెదక్‌జోన్‌: జిల్లాలోని మెదక్‌, నర్సాపూర్‌, రామాయంపేట, తూప్రాన్‌ పరిధిలో 2020 డిసెంబర్‌లో 11,380 మంది మీసేవ ద్వారా ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో 1,191 దరఖాస్తులను మాత్రమే పరిష్కరించిన అధికారులు మిగితా వాటిని పెండింగ్‌లో పెట్టారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది ఆగస్టులో ఎల్‌ఆర్‌ఎస్‌పై నిర్ణయం తీసుకుంది. ప్లాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని నిర్ణయించింది. ప్లాట్లు సక్రమంగా ఉన్నాయా..? లేవా.. అని పరిశీలించేందుకు మున్సిపల్‌, రెవెన్యూ, ఇరిగేషన్‌ శాఖలకు చెందిన అధికారులను ప్రత్యేకంగా నియమించింది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 10,182 ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులు ఉండగా, ఇప్పటివరకు మెదక్‌, నర్సాపూర్‌ మున్సిపాలిటీలలో మాత్రమే సర్వేను ప్రారంభించారు. మెదక్‌లో 3,527 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, గతేడాది ఆగస్టులో సర్వేను ప్రారంభించిన అధికారులు ఇప్పటివరకు సుమారు 1,000 దరఖాస్తులను పరిశీలించి వాటికి సంబంధించిన ప్లాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అందులో పలు కారణాలతో 100 దరఖాస్తులను తిరస్కరించారు. 900 ప్లాట్లు సక్రమంగా ఉన్నాయని తేల్చారు. అలాగే నర్సాపూర్‌ మున్సిపాలిటీలో 1,936 దరఖాస్తులకు 430 పరిశీలించారు. వాటిలో 20 ప్లాట్లను తిరస్కరించారు. 58 ప్లాట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో నోటీసులు జారీ చేశారు. 7 మాత్రమే మాత్రమే సక్రమంగా ఉన్నాయని తేల్చారు. కాగా మొత్తంగా ఇప్పటివరకు 14శాతం ప్లాట్లను మాత్రమే పరిశీలించారు.

రామాయంపేట, తూప్రాన్‌లో నిల్‌

రామాయంపేట మున్సిపాలిటీలో 2,491 దరఖాస్తులు ఉండగా, ఇప్పటి వరకు ప్రక్రియ ప్రారంభం కాలేదు. అలాగే తూప్రాన్‌ మున్సిపాలిటీ పరిధిలో 3,426 దరఖాస్తుల్లో ఒక్కటి కూడా పరిశీలనకు నోచుకోలేదు. ఈ మున్సిపాలిటీల్లో సిబ్బంది అంతా ఇన్‌చార్జిలుగా కొనసాగుతుండడంతో ప్లాట్ల క్రమబద్ధీకరణ ఇంకా ప్రారంభించలేదని తెలుస్తోంది. ఇంటి నిర్మాణం కోసం కొనుగోలు చేసిన ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ ఎప్పుడు అవుతుందా? అని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. క్రమబద్ధీకరిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని పలువురు చెబుతున్నారు. త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైనా ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో ముందుకుసాగడం లేదని వాపోతున్నారు.

అర్హుల ఎంపిక ప్రక్రియ షురూ

- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కోసం..
- కనీసం 20 రోజులు 'ఉపాధి' పనులకు హాజరైన కూలీల గుర్తింపు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి జిల్లాలో అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ షురువైంది. 2023–24 ఆర్థిక ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీల కుటుంబాల్లో భూమిలేని వారిని ఈ పథకానికి అర్హులుగా ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆ సంవత్సరంలో 20 రోజులు ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీల కుటుంబాలెన్ని ఉన్నాయనే దానిపై జిల్లా అధికారులు లెక్కలు తీశారు. మొత్తం 94,454 కుటుంబాల (జాబ్‌కార్డులు) 2023–24లో కనీసం 15 రోజులు ఉపాధి హామీ పనులకు హాజరైనట్లు తేల్చారు. ఇందులో 20 రోజులు హాజరైన కూలీల కుటుంబాలు సుమారు 90 వేల వరకు ఉంటాయని అంచనాకు వచ్చారు. ఈ 90 వేల కూలీల కుటుంబాల్లో అసలు వ్యవసాయ భూమిలేని నిరుపేదలెంతమంది అనేది గుర్తించనున్నారు. ఇందుకోసం కూలీల కుటుంబాల ఆధార్‌ కార్డులతో పూర్తి పరిశీలన చేపడతామని అధికారులు చెబుతున్నారు.

సీఆర్‌డీకి నివేదిక...

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఈ నెల 26 నుంచి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 2023–24లో ఉపాధి హామీ కూలీ పనులకు హాజరైన కూలీల కుటుంబాల వివరాలతో జిల్లా అధికారులు నివేదికను సిద్ధం చేశారు. ఈ నివేదికను సీఆర్‌డీకి పంపినట్లు ఉపాధి హామీ పథకం అధికారులు తెలిపారు.

నారాయణఖేడ్‌లో అత్యధికం..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించిన లబ్ధిదారుల సంఖ్య నారాయణఖేడ్‌ మండలంలో ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయి. 2023–24లో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలు ఈ మండలంలోనే అధికంగా ఉన్నారు. ఈ ఒక్క మండలంలోనే 7,167 మంది కనీసం 15 రోజులు ఉపాధి హామి పనులకు హాజరైనట్లు లెక్కలు తేల్చారు. ఇందులో 20 రోజులు హాజరైన వారు సుమారు 6,800 మంది వరకు ఉంటారని అంచనాకు వచ్చారు. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా హత్నూర, ఝరాసంఘం, మొగుడంపల్లి, కంగ్టి, రాయ్‌కోడ్‌, పుల్‌కల్‌, న్యాలకల్‌, సదాశివపేట, సిర్గాపూర్‌ మండలాల్లో ఎక్కువ మంది ఉపాధి పనులకు వెళ్లిన కూలీలున్నారు.

'లక్ష డప్పుల'తో సత్తా చాటుదాం: ఎమ్మార్పీఎస్‌

చిన్నశంకరంపేట(మెదక్‌): వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు కార్యక్రమ విజయవంతం కోసం ఈనెల 25వ తేదీన రామాయంపేటకు వస్తున్న మంద కృష్ణమాదిగకు ఘనస్వాగతం పలకాలని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర నాయకులు కొలుపుల రామస్వామి, మురళి మాదిగ కోరారు. సోమవారం నార్సింగి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్‌ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏబీసీడీ వర్గీకరణ కోసం నిర్వహిస్తున్న ఉద్యమంలో ప్రతీ ఒక్కరు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భోగి కాంతులు

ఎక్కడ చూసినా సంబురాలే

- ఇళ్ల ముంగిట కళకళలాడిన రంగవల్లులు
- పతంగులతో సరదాగా పిల్లలు, పెద్దలు
- నేడు మకర సంక్రాంతి
- రేపు కనుమ పండుగ



మెదక్‌జోన్‌: భోగభాగ్యాలను అందించే భోగి పండుగను సోమవారం జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. తెల్లవారుజామునే ఉత్సవాలను ప్రారంభించారు. సూర్యోదయానికి ముందే పల్లెపట్నం తేడా లేకుండా కాలనీలు, వీధుల్లో భోగి మంటలు వేశారు. పాతకు స్వస్తి పలికి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ ఆనందంగా గడిపారు. ముంగిళ్లను శుభ్రపరిచి, అందమైన ముగ్గులు వేశారు. గొబ్బెమ్మలను పెట్టి, పూలు, నవధాన్యాలు పెట్టి అలంకరించారు. పట్టణంలో రాత్రి వేళ భోగి మంటలు వేశారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో పిడకలు, పూలు, రేగిపండ్లు, నవధాన్యాలను విక్రయించారు. చిన్నారులు పతంగులను ఎగురవేస్తూ గంతులు వేశారు. దీంతో ఎక్కడ చూసినా పండుగ సందడే కనిపించింది.



శివ్వంపేట(నర్సాపూర్‌): గూడూర్‌లో భోగి మంటలు

సంక్రాంతికి సర్వం సిద్ధం

మంగళవారం సంక్రాంతి పండుగను నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. రంగు రంగుల రంగవల్లులు వేసేందుకు మహిళలు రంగులను కొనుగోలు చేశారు. పిండి వంటలను సిద్ధం చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కుటుంబ సభ్యులంతా ఒకే చోట చేరడంతో ప్రతి ఇంటా సందడి నెలకొంది. బుధవారం కనుమ పండగను నిర్వహించనున్నారు.

అభివృద్ధికి పాటుపడతాం



మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌ షెట్కార్‌, చిత్రంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్‌: స్వర్గీయ అప్పారావు షెట్కార్‌, శివరావు షెట్కార్‌, కిష్టారెడ్డిల అడుగుజాడల్లో నడుస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడతామని జహీరాబాద్‌ ఎంపీ సురేశ్‌ షెట్కార్‌, ఖేడ్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డి స్పష్టం చేశారు. స్వాతంత్య్ర సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే శివరావు షెట్కార్‌ వర్ధంతి సభ, సర్వధర్మ సమ్మేళనాన్ని పట్టణ శివారులోని ఆయన సమాధి వద్ద సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ హయాంలోనే ఈ ప్రాంత అభివృద్ధి జరిగిందన్నారు. జవహర్‌ నవోదయ విద్యాలయాన్ని ఖేడ్‌లో ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి మెదక్‌ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేశ్‌ షెట్కార్‌, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్‌



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజం

జహీరాబాద్‌: గిరిజనులకు కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి సర్కార్‌ పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో జరుగుతున్న మోతీమాత జాతరలో సోమవారం హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గతంలో కేసీఆర్‌ 10% రిజర్వేషన్‌తో విద్య, ఉద్యోగాలలో గిరిజనులకు అవకాశం ఇచ్చారన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి తాగునీటి వసతులు కల్పించారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌ పార్టీ గిరిజన బంధు కింద రూ.12లక్షలు ఇస్తామన్న ఎన్నికల హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. విదేశాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఓవర్సీస్‌ ఉపకారవేతనాలను కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆపేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కె.మాణిక్‌రావు, చింతా ప్రభాకర్‌, డీసీఎంఎస్‌ చైర్మన్‌ శివకుమార్‌ పాల్గొన్నారు.

కొండపోచమ్మసాగర్‌పై నజర్‌

- బందోబస్తుకు చర్యలు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్‌..

గజ్వేల్‌: కొండపోచమ్మసాగర్‌పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సాగర్‌ వద్ద హెచ్చరికల బోర్డులు, రక్షణ చర్యలు చేపట్టారు. మర్కూక్‌ మండలం కొండపోచమ్మసాగర్‌ వద్ద ఐదుగురు యువకులు మృతి చెందిన ఘటన నేపథ్యంలో రక్షణ చర్యల వైఫల్యంపై సోమవారం సాక్షిలో 'తెరపైకి పోలీస్‌ అవుట్‌ పోస్టు' శీర్షికన ప్రచురితమైంది. ఈ కథనంపై సీపీ అనురాధ స్పందించారు. ఈమేరకు ఈ రిజర్వాయర్‌ ప్రధాన ద్వారాల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. అంతేకాకుండా సెలవు దినాల్లో పోలీసులచే బందోస్తు నిర్వహణ, బ్లూకోల్ట్స్‌ సిబ్బంది తరుచూ పెట్రోలింగ్‌ నిర్వహణకు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈమేరకు గజ్వేల్‌ రూరల్‌ సీఐ మహేందర్‌రెడ్డి ప్రాజెక్ట్‌ సందర్శన వచ్చిన యువలకు జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌ సందర్శనలో భాగంగా లోపలికి దిగడానికి, చేపలు పట్టడానికి అనుమతి లేదని సూచించారు. అలాగే జిల్లాలోని మల్లన్నసాగర్‌, రంగనాయకసాగర్‌, అనంతగిరి, ఎల్లమ్మచెరువు, కోమటిచెరువు, పాండవుల చెరువుతో ఇతర ప్రధాన జలశయాల వద్ద తరుచూ బందోబస్తు నిర్వహణకు సైతం సీపీ ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జలాశయాల వద్దకు ఈత కోసం వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ప్రమాదాల జరిగిన తర్వాత బాధపడే బదులు... జరగకుండా చూసుకోవాలన్నారు.



కొండపోచమ్మసాగర్‌ ప్రధాన ద్వారం వద్ద పోలీసు బందోబస్తు

పడిపోయిన టమాటా ధర

25 కిలోల బాక్స్‌ రూ. 200లకే

- డిసెంబర్‌లో రూ. 1,200 పలికిన ధర
- దిగుబడి పెరగడంతో తగ్గిన రేట్లు
- ఆందోళనలో రైతులు

ఈ చిత్రంలోని రైతు పేరు హరిగౌడ్‌. శివ్వంపేట మండలం నవాపేట గ్రామం. గతేడాది నవంబర్‌ మొదటి వారంలో ఐదెకరాల్లో టమాట సాగు చేపట్టారు. సాగు కోసం ఎకరాకు రూ. 40 నుంచి రూ. 45 వేల చొప్పున ఐదెకరాలకు రూ. 2 లక్షలకు పైగా ఖర్చు చేశాడు. నెల రోజుల తర్వాత దిగుబడి రావడం ప్రారంభమైంది. డిసెంబర్‌లో 25 కిలోల బాక్స్‌ రూ. 1,000 నుంచి రూ. 1,250 ఉండగా, ప్రస్తుతం రూ. 200 నుంచి రూ. 250 పలుకుతోంది. కూలీ సైతం గిట్టుబాటు కాకపోవడంతో రెండెకరాల్లో పంటను ధ్వంసం చేసి వరి సాగు కోసం సిద్ధమయ్యాడు. మిగితా మూడెకరాల్లో టమాటను తెంపకుండా పొలంలోనే వదిలేశాడు.



చేనులో వదిలేసిన టమాట పంటను చూపుతున్న రైతు

నర్సాపూర్‌ రూరల్‌: మొన్నటి వరకు కాసులు కురుపించిన టమాట.. ఇప్పుడు రైతులకు కన్నీరు తెప్పిస్తోంది. పంట చేతికి వచ్చే సమయంలో ధరలు తగ్గడంతో పెట్టుబడి కూడా వచ్చే అవకాశాలు లేక తలలు పట్టుకుంటున్నారు. టమాట కిలో రైతు మార్కెట్‌లో రూ. 15 నుంచి రూ. 20 పలుకుతుండగా.. వ్యాపారులు మాత్రం రైతులకు కిలోకు రూ. 5 నుంచి రూ. 8 వరకు చెల్లిస్తున్నారు. నర్సాపూర్‌ వ్యవసాయ డివిజన్‌ పరిధిలోని నర్సాపూర్‌, శివ్వంపేట, తూప్రాన్‌, మనోహరాబాద్‌ మండలాల్లోని రైతులు సుమారు 450 ఎకరాల్లో టమాట సాగు చేశారు. గతేడాది డిసెంబర్‌లో కిలో టమాటా రూ. 50 నుంచి రూ. 60 పలకడంతో చాలా మంది రైతులు తమ బోరు బావుల కింద సాగు చేశారు.

మార్కెట్‌లో పరిస్థితి ఇలా..

ప్రస్తుతం నర్సాపూర్‌ డివిజన్‌ కేంద్రంతో పాటు పలు మార్కెట్‌లలో టమాట పంట ఎక్కువగా వస్తుండడంతో ధర భారీగా తగ్గింది. రైతులు టమాటతో పాటు ఇతర కూరగాయలను ప్రతిరోజూ ఉదయం వాహనాల్లో నర్సాపూర్‌తో పాటు పలు మార్కెట్‌లలోని బీటీకి తరలిస్తారు. రైతులు తీసుకెళ్లిన కూరగాయలను ఏజెంట్లు, దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు. మధ్య దళారులు, కమీషన్‌ ఏజెంట్లు ధరను పెంచుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

ధర లేక నష్టపోతున్నాం



గత నెలలో టమాటకు మంచి డిమాండ్‌ ఉండి. కిలో రూ. 50 నుంచి 60 వరకు పలికింది. దీంతో ఎకరంలో టమాట సాగు చేశా. విత్తనం నుంచి పంట కాపుకు వచ్చే వరకూ పెట్టుబడిగా రూ. 45 వేల వరకు ఖర్చు చేశా. ప్రస్తుతం ధర లేక పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదు. మార్కెట్లో స్వయంగా అమ్ముకుంటున్న గిట్టుబాటు కావడం లేదు.

– గోవింద్‌ నాయక్‌, రైతు, తుల్జారాంపేట, నర్సాపూర్‌

ఒకే రకం పంట సాగు చేయొద్దు



గిట్టుబాటు ధరకు అనుగుణంగా రైతులు కూరగాయల పంటలు సాగు చేసుకోవాలి. ఒకే రకం పంట సాగు చేయకుండా ఉన్న భూమిలో ఆయా రకాల పంటలు సాగు చేయాలి. ఇలా చేస్తే ఓ పంటకు డిమాండ్‌ లేకున్నా మరో పంటకు డిమాండ్‌ ఉండే అవకాశం ఉంటుంది.

– సంధ్యారాణి, వ్యవసాయ డివిజన్‌ అధికారిణి

సాగుబడి.. కొత్త ఒరవడి

- కూరగాయలు, పండ్ల సాగు వైపు రైతున్న చూపు
- అంతరపంటగా కాసులు కురిపిస్తున్న బొప్పాయి
- సేంద్రియానికే మొగ్గు చూపుతున్న..

సాగులో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. వ్యవసాయంలో సాంకేతికతను జోడించి సేంద్రియ సాగు చేస్తున్నారు. తాము ఉపాధి పొందుతూ నలుగురికి మార్గం చూపుతున్నారు. అందులోను పాలకూర ఇంట సిరులు కురిపిస్తుండగా.. ప్రత్యామ్నాయ పంటలు అధిక ఆదాయం సమకూరుస్తున్నాయి. ఈ మేరకు తక్కువ పెట్టుబడితో అధికంగా ఆర్జిస్తున్న రైతులపై ప్రత్యేక కథనం..



సేంద్రియ కూరగాయలతో రైతు శివపూర్ణిమ

ఉద్యోగం నుంచి.. ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు వరకు..

ములుగు(గజ్వేల్): ఆరోగ్యకర ఆహారం అవసరం. ఈ ఆలోచనే సేంద్రియ సాగు వైపు నడిపించిందంటున్నారు సిద్దిపేట జిల్లా ములుగు మండలం జప్తిసింగాయిపల్లి మహిళా రైతు గండికోట శివపూర్ణిమ. ఎంబీఏ చదివారు. 15 ఏళ్లపాటు ఉద్యోగం చేశారు. ఎకరంన్నర భూమి భూమి కొన్నారు. వివిధ పంటలు సాగు చేసిన తర్వాత ఉద్యోగం వదిలేశారు. సేంద్రియ సాగు చేపట్టి నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వివిధ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను పూర్తి సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారు. అదే స్థాయిలో లాభాలు సమకూరుతున్నాయి. మరో నలుగురికి సేంద్రియ సాగు విధానం పరిచయం చేసే అవకాశం వచ్చింది. ప్రస్తుతం మిర్చి, వంకాయ, బెండ, ఆకుకూరలు తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఇటీవల బొల్లారం రాష్ట్రపతి భవన్ ఉద్యాన్ ఉత్సవ్‌లో సేంద్రియ ఆహార ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సేంద్రియ కూరగాయల ప్రయోజనాల గురించి తెలిపారు.

కూరగాయల సాగులో మహిపాల్‌రెడ్డి ఆదర్శం



కొడిపల్లి(నర్సాపూర్): కూరగాయల సాగులో మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. మెదక్ జిల్లా హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటంతో రైతులు కూరగాయలు సాగుచేస్తే రోజూ డబ్బులు వస్తాయని చెబుతున్నాడు. ప్రస్తుతం కొడిపల్లి, మహమ్మద్‌నగర్, ముట్రాజ్‌పల్లి గ్రామాలలో భూమి లీజుకు తీసుకుని 35 ఎకరాలలో కూరగాయలు సాగు చేస్తున్నాడు. క్యాప్సికం, కాకర పంటలు వేస్తున్నాడు. అతడిని చూసి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు కూరగాయల సాగువైపు దృష్టిసారించారు. తన పొలంలో 30 – 50 మంది కూలీలు పనులు చేస్తుంటారని ఇతరులు ఉపాధి కల్పిస్తున్నారు. స్థానిక కూలీలతోపాటు బిహార్‌కు చెందిన కూలీలు పనులు చేస్తున్నారు.

బొప్పాయి.. ఆదాయం బోలెడు

వర్గల్(గజ్వేల్): ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా బొప్పాయి. ప్రధానపంటకు ముందే చక్కని దిగుబడి సాధిస్తూ లాభాలు గడిస్తున్నారు వర్గల్ రైతు వేలూరి కృష్ణారెడ్డి. శాకారంలో రెండున్నర ఎకరాలలో 2022 అక్టోబర్‌లో ఆయిల్‌పామ్ సాగుచేశారు. ప్రధానపంట దిగుబడి వచ్చే వరకు అదనపు ఆదాయం పొందేలా చెట్ల వరుసల మధ్య అంతర పంటగా 2023 నవంబర్‌లో బొప్పాయి సాగు చేశారు. సెప్టెంబర్ నుంచి పండ్ల దిగుబడి మొదలైంది. ప్రతీ వారానికి రెండు కోతలతో నెలకు సగటున 21 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నది. ఎనిమిది నెలల పంట దిగుబడి కాలంలో 16 నుంచి 17 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ధర కూడా ఆశాజనకంగానే ఉంది. కిలో రూ.18 నుంచి రూ.20 వరకు పలుకుతుంది. రెండున్నర ఎకరాల తోటకు పెట్టుబడి ఖర్చు రూ.40 వేలు. ప్రతీనెల సగటున రూ.10 వేల మందులు తదితర నిర్వహణ ఖర్చులు కలిపి పంట కాలంలో రూ. లక్షన్నర ఖర్చవుతోంది. ప్రస్తుత ధరలు, సెప్టెంబర్ నుంచి జనవరి మొదటి వారం వరకు వచ్చిన ఆదాయం ప్రకారం ఖర్చులు పోగా అంతరపంట ద్వారా రూ. 1.50 లక్షల ఆదాయం సమకూరింది. మరో 12 ఎకరాలలో బొప్పాయి అంతరసాగుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. కలెక్టర్ మను, కేంద్ర ఆయిల్‌ఫెడ్ జాయింట్ సెక్రటరీ అజిత్‌కుమార్ సాహు ఆయిల్ పామ్‌లో అంతరపంటగా సాగుచేసిన బొప్పాయి తోటను ఇటీవల ప్రత్యక్షంగా సందర్శించారు.


బొప్పాయితోటలో రైతు కృష్ణారెడ్డి

కొద్దిపాటి నీటి వనరులతో పంటలు


పొద్దు తిరుగుడు సాగులో రైతు బీడ ఎల్లం

మిరుదొడ్డి(దుబ్బాక): మండలంలోని అందె గ్రామానికి చెందిన రైతు బీడ ఎల్లం. రెండు ఎకరాలను కౌలుకు తీసుకొని తక్కువ సమయం తక్కువ పెట్టుబడి కొద్దిపాటి నీటి వనరులతో లాభాల పంటలు పండిస్తున్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలపై దృష్టి సారిస్తున్నారు. పొద్దు తిరుగుడు, మొక్కజొన్న, వెల్లుల్లి, ఉల్లి, వంగ, మిరప, సొర, చిక్కుడుతో పాటు అన్ని రకాల ఆకు కూరలను పండిస్తున్నారు. రసాయన ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను వాడుతూ నాణ్యమైన దిగుబడులను సాధిస్తున్నారు. కేవలం 90 రోజుల్లోనే మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంట చేతికొస్తాయి. పెట్టుబడి రూ.40 వేలు పోను రూ.92 వేల లాభాలు సమకూరుతుందని ఎల్లం తెలిపాడు. పంటల మార్పిడి చేస్తున్నారు. కొద్దిపాటి వ్యవసాయ భూమిలో సాగు చేసుకోవచ్చని చెబుతున్నారు.

సిరులు కురిపిస్తున్న పాలకూర


కొడిపల్లి: పాలకూర కట్ చేస్తున్న సూర్యబాబు

కొడిపల్లి(నర్సాపూర్): సంప్రదాయ పంటలకు భిన్నంగా ఆలోచించాడు. కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా కూరగాయల సాగు ప్రారంభించాడు. పాలీహౌస్‌లో 30 గుంటలో సేంద్రియ పద్ధతిలో పాలకూరసాగు చేసి రూ. 3లక్షలు సంపాదించాడు. యువరైతు కల్లూరి సూర్యబాబు. ఆయన సొంతూరు రాయిలాపూర్. డిగ్రీ చదివి మొదట ప్రైవేటు ఉద్యోగం చేశారు. అనంతరం పాలీహౌస్ ఉండటంతో కుటుంబ సభ్యుల సహకారంతో మొదట డెకరేషన్ పూలు, అనంతరం వివిధ కూగాయల సాగు పెంచారు. కేవీకే శాస్త్రవేత్తలు సలహాలు సూచనల మేరకు పాలకూర సాగు చేపట్టారు. పెట్టుబడి ఖర్చు రూ. 20వేలు. ఒక్కసారి విత్తితే నాలుగు సార్లు కోతకు వస్తున్నది. రోజూ ఉదయం కట్ చేసి అన్నారం మార్కెట్‌లో విక్రయిస్తున్నాడు. ఇప్పటి వరకు రూ. 3 లక్షలు ఆదాయం వచ్చింది. కేవీకే సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. పంటమార్పిడికి కొత్తిమీర, ఇతర కూరగాయలు చేస్తున్నారు. మంచి లాభాలు ఉన్నాయని సూర్యబాబు తెలిపారు.

క్లుప్తంగా

చోరీ కేసులో పాతనేరస్తుల అరెస్టు


నిందితులను చూపుతూ, కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

కొల్చారం(నర్సాపూర్): ఆలయంలో దొంగతనానికి పాల్పడిన కేసులో పాత నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివారాల ప్రకారం... మెదక్ పట్టణానికి చెందిన జహంగీర్, ప్రవీణ్ అనే ఇద్దరు ఈనెల 10వ తేదీ రాత్రి మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవి ఆలయం గుడి తాళాలు పగులగొట్టి అమ్మవారి రెండు ముక్కుపుడకలు, హుండీలో డబ్బులు ఎత్తుకెళ్లారు. పాత నేరస్తులను విచారిస్తుండగా ఇద్దరి ప్రవర్తన అనుమానించే విధంగా ఉండడంతో విచారిస్తే చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ


షాపును పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవీందర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. ఈ సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం తెల్లావారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్‌లోని ఎంఎం మద్యం షాపు యజమానులు ఆదివారం రాత్రి దుకాణం మూసేసి ఇంటికి వెళ్లారు. సోమవారం తెల్లావారుజామున గుర్తు తెలియని దుండగులు షట్టర్‌కు వేసిన తాళం పగులకొట్టి లోపలికి చొరబడ్డారు. గల్లపెట్టెలో ఉన్న రూ.60 వేల నగదుతోపాటు రెండు ఫుల్ మద్యం సీసాలు, బీరు సీసాలను ఎత్తుకెళ్లినట్లు యజమానులు పోలీసులు తెలిపారు. స్కూటీపై ముగ్గురు వచ్చి చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హైనా దాడిలో 17 జీవాలు మృతి


మృతిచెందిన జీవాలు

మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మద్దూరు మండలం లద్నూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంధ్యబోయిన రామచంద్రం గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. రోజూ లాగే జీవాలను మేతకు తోలి ఆదివారం రాత్రి తిరిగి కోష్టానికి చేర్చాడు. సోమవారం తెల్లవారుజామున దొడ్డిలో హైనా దాడి చేయగా 17 జీవాలు మృతిచెందాయి. కొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. ఈ సంఘటనతో సుమారుగా రూ. లక్ష 50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రెండ్రోజులుగా హైనా దాడులతో రైతులు బెంబేలెత్తారు. అటవీ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని వేడుకున్నారు.

విద్యార్థి అదృశ్యం


వరుణ్

పటాన్‌చెరు టౌన్: ఒక విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి గ్రామం విజేత కాలనీకి చెందిన తొమ్మిదో తరగతి చదివే విద్యార్థి వరుణ్ (15) సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా బాలుడి ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేశ్ తెలిపిన వివరాలు ప్రకారం... అమీన్‌పూర్ కు చెందిన శ్రీకాంత్ (36) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మద్యం తాగాడు ఆ మత్తులో శనివారం అర్ధరాత్రి భార్యతో గొడవపడ్డాడు. మనస్తాపం చెందిన అతడు పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎండీఆర్ సిబ్బంది, గజ ఈతగాళ్లను రప్పించారు. మృతదేహం కోసం గాలించినా దొరకలేదు. సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని అమీన్‌పూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

16న ఏడు వాహనాలు వేలం

పటాన్‌చెరు టౌన్: గంజాయి కేసుల్లో పట్టుబడిన ఏడు ద్విచక్ర వాహనాలను ఈనెల 16న వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించే వేలంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జూద స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

పోలీసుల అదుపులో నలుగురు

గజ్వేల్‌రూరల్: జూద స్థావరంపై టాస్క్‌ఫోర్స్, పోలీసులు దాడులు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజ్ఞాపూర్ శివారులో కొంతమంది జూదం ఆడుతున్నారని అందిన నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు రైడ్ చేశారు. పై నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.12,980 నగదుతో పాటు నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి గజ్వేల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లోని బహిరంగ ప్రదేశాలు, ఫామ్‌హౌస్‌లు, ఇళ్లలో ఎవరైనా పేకాట, జూదం, ఇతర చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే 87126-67445, 87126-67446, 87126-67447 టాస్క్‌ఫోర్స్ నంబర్లలో సమాచారం అందించాలని సూచించారు.

ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్నిప్రమాదం


ప్రమాదంలో కాలిపోయిన వస్తువులు, మిషనరీ

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని కుకునూర్ గ్రామ శివారులో ప్లాస్టిక్ వస్తువులు తయారు చేసే సాయి సంతోషి రేణుక పరిశ్రమలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో ప్లాస్టిక్ వస్తువులు, మిషనరీ పూర్తిగా దగ్ధమైంది. పార్క్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.3 కోట్ల విలువ మేరకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండొచ్చని యజమానులు అనుమానం వ్యక్తం చేశారు. కాగా, పరిశ్రమలో పనిచేసి అక్కడే నిద్రించే కార్మికులు పని నిమిత్తం వెల్దుర్తి వెళ్లిన సమయంలో అగ్నిప్రమాదం సంభవించి మంటలు ఎగిసిపడ్డాయి. చుట్టుపక్కల వారి సాయంతో గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. చివరికి నర్సాపూర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను ఆర్పివేశారు.

సైన్స్ టీచర్‌కు అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న సైన్స్ టీచర్ భాస్కర్‌రెడ్డి

దుబ్బాక: ఇన్నోవేటీవ్ టీచింగ్ మెథడ్ ప్రదర్శనలో రాయపోల్ మండలం బేగంపేట జెడ్పీహెచ్ఎస్ సైన్స్ టీచర్ కె.భాస్కర్‌రెడ్డి జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్నారు. మధ్యప్రదేశ్.. బర్హన్‌పూర్‌లో మ్యాక్రో విజన్ అకాడమీ రామన్‌సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ సైంటిస్ట్ ఇండియా ఈనెల 11, 12వ తేదీల్లో 5వ భారతీయ సైన్స్ అండ్ టెక్నాలజీ-2025 కార్యక్రమం నిర్వహించింది. 18 రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీతను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, హెచ్ఎం అంజిరెడ్డిలు అభినందించారు.

భజనకు వెళ్తుండగా అనంతలోకాలకు

కారు ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన బొందయ్య

కొడిపల్లి(నర్సాపూర్): స్కూటీపై నుంచి కింద పడిన వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ సంఘటన కొడిపల్లిలో సోమవారం జరిగింది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణం గోల్కొండ కాలనీకి చెందిన కాసాపురం బొందయ్య(55) సోమవారం కంచన్‌పల్లి గ్రామంలో భజన ఉందని భార్య సుశీలకు చెప్పి స్కూటీపై బయలుదేరాడు. 765డి జాతీయ రహదారిపై కొడిపల్లి డీసీసీబీ సమీపంలో యూటర్న్ వద్ద సైకిల్‌ను తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి ఆయన కిందపడ్డాడు. స్కూటీ వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఇదే కారులో చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బొందయ్య అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన నరేందర్

చిన్నశంకరంపేట(మెదక్): బైక్‌ను కారు ఢీకొట్టగా వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన నార్సింగి మండలం వల్లూర్ బస్టాప్ వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం మేరకు... వల్లూర్ గ్రామస్తుడు శంబుని నరేందర్ గ్రామ శివారులో పొలం పనులు ముగించుకొని మధ్యాహ్నం భోజనం చేసేందుకు బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఇదే సమయంలో నిజామాబాద్ నుంచి హైదారాబాద్ వైపునకు వస్తున్న కారు అతివేగంగా వెనుకగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కిందపడిన నరేందర్ తలకు తీవ్రగాయమైంది. వెంటనే గ్రామస్తులు ఆటోలో నార్సింగి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం


ప్రమాదానికి గురైన బస్సు

కోహెడరూరల్(హుస్నాబాద్): జాతీయ రహదారి పనుల ఆలస్యం వల్ల అక్కడక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా బస్వాపూర్ బ్రిడ్జి వద్ద సోమవారం రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో వన్‌వేలో ఎదురెదురుగా వాహనాల రాకపోకలకు అనుమతించారు. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన ఆర్టీసీ బస్సు రోడ్డు కిందికి దూసుకెళ్లింది. స్థానికులు గమనించి ప్రయాణికుల్ని బయటికి లాగి రక్షించారు. దీంతో పెనుప్రమాదం తప్పింది.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి సూసైడ్

సంగారెడ్డి క్రైమ్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏ రవీందర్ (27) కొన్ని నెలల క్రితం కొడిపల్లి గ్రామం నుంచి బతుకుదెరువు కోసం సంగారెడ్డికి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల, తెచ్చిన అప్పు తీర్చలేక ఈనెల 12న రాత్రి 10.30 గంటలకు తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవీందర్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

సంగారెడ్డి క్రైమ్: హత్య కేసులో నిందితుడైన బురాన్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఓ కేసులో ఇరికించాడని కక్షతో షేక్ సమీర్‌ను హత్య చేయడం తెలిసిందే. ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న యూసుఫ్‌ను ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిని 45 రోజులపాటు రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

గజ్వేల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినాయక్


సిద్దిపేటకమాన్: దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ వాసుదేవరావు


గజ్వేల్‌రూరల్: నోటీసులు అందజేస్తున్న అటవీ శాఖ సిబ్బంది

గజ్వేల్‌రూరల్: చైనా మాంజా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినాయక్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలో గాలిపటాలను విక్రయించే దుకాణాదారులకు నోటీసులను అందజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంలో ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా గాలిపటాలను ఎగురవేసి సంతోషంగా పండుగను జరుపుకోవాలన్నారు. చైనా మాంజా వినియోగంతో వన్యప్రాణులు, యువత, పిల్లలు, వాహనదారులు ఇబ్బందులు పడే ప్రమాదముందన్నారు. వాటి వల్ల జరిగే అనర్థాలు, దుష్పరిణామాలు, పొంచి ఉన్న ముప్పు ప్రమాదంపై వారం రోజులుగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని ములుగు, మర్కూక్, జగదేవ్‌పూర్, వర్గల్, గజ్వేల్ మండలాల్లోని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు బాలేశ్, పవన్, షెకావత్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అర్జున్, బీట్ ఆఫీసర్లు రాజు, కిషోర్, ప్రసాద్, గౌరీస్వామి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో పోలీసు తనిఖీలు

సిద్దిపేటకమాన్: చైనా మంజా విక్రయించే దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని పలు కైట్స్ విక్రయ దుకాణాల్లో పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసే చైనా మంజాలతో మనుషులకు, పక్షులకు ప్రమాదం వాటిల్లుతుందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు చైనా మంజాతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు.

కోహెడలో..

కోహెడ(హుస్నాబాద్): చైనా మాంజాను విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అభిలాష్ హెచ్చరించారు. కోహెడలో పలు షాపులలో తనిఖీ నిర్వహించారు. మాంజా వినియోగం వల్ల జరిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సాధారణ దారంతో పతంగిలను ఎగురవేయాలని సూచించారు.

బాధితులకు కమిషన్ అండ

ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వెంకటయ్య


అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్రంలో ఎక్కడైనా దళితులపై దాడి జరిగితే బాధితులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా నిలుస్తుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత టీఎంఆర్‌పీఎస్ నేత గుర్రాల శ్రీనివాస్, అంబేడ్కర్ సేవారత్న అవార్డు పొందిన జర్నలిస్టు కుంబాల రవీందర్, కార్మిక అవార్డు పొందిన సుంకరి యాదగిరిలను సోమవారం డీబీఎఫ్ ఆధ్వర్యంలో అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఆత్మీయ సన్మానం చేశారు. తెలంగాణ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీలపై ఎక్కడ దాడులు జరిగినా కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల హక్కుల కోసం ప్రతీఒక్కరు పాటు పడుతూ సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబాషి సంజీవ్, నాయకులు సూకూరి లింగం, రాజులు, కమలాకర్‌రెడ్డి, బుచ్చయ్య, ర్యాకం శ్రీరాములు, కుమార్, రవి, దుబ్బరాజం, రాములు, కిరణ్, రాజమల్లు, మల్లన్న, ముత్యం, పర్శరాములు, సిద్దిరాములు, కిషన్, లక్ష్మణ్, భాస్కర్, సాయిలు, బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంక్రాంతి శుభాకాంక్షలు


ప్రసాద్‌కుమార్‌

అనంతగిరి: జిల్లా ప్రజలకు స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌ సోమవారం ఒక ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ భోగ భాగ్యాలతో పండుగ జరుపుకోవాలన్నారు. సంక్రాంతి రైతు పండుగ అని.. పంట ఇంటికి చేరిన సమయంలో చేసుకునే వేడుక అన్నారు. మూడు రోజులపాటు ఉత్సాహంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

చైనా మాంజా విక్రయాలపై కేసు


పతంగుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

నారాయణఖేడ్‌: ఖేడ్‌ పట్టణంలోని పలు పతంగులు విక్రయించే దుకాణాలను సోమవారం స్థానిక ఎస్‌ఐ శ్రీశైలం సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో విక్రయిస్తున్న మాంజాలను పరిశీలించారు. రెండు దుకాణాల్లో చైనా మాంజాని విక్రయిస్తున్నట్లు గుర్తించి ఈ మేరకు కేసులు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

మునిపల్లి(అందోల్‌): వివిధ గ్రామాలకు చెందిన 36మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను రాయికోడ్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్‌ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రసూల్‌ పటేల్‌ తదితరులు పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తితో ముందుకు సాగాలి


మాట్లాడుతున్న యువజన సంఘం కార్యదర్శి శ్రీనివాస్‌

జహీరాబాద్‌ టౌన్‌: అంబేడ్కర్‌ స్టడీ సర్కిల్‌ ఆధ్వర్యంలో సోమవారం సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్‌ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే మహిళల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలన్నా రు. కార్యక్రమంలో అంబేడ్కర్‌ స్టడీ సర్కిల్‌ వ్యవస్థాపకులు రాంచందర్‌ భీంవంశీ, యువజన సంఘం కార్యదర్శి శ్రీనివాస్‌, కో ఆపరేటివ్‌ సొసైటీ అధ్యక్షుడు నర్సింహులు రాంతీర్థం, డాక్టర్‌ సీతా రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కొమ్మూరి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వీరన్నపేటలో ప్రభుత్వ ప్రత్యేక గ్రాంట్‌ నుంచి చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం మాజీ ఎమ్మెల్యే, జనగామ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు మంజె మల్లేశం, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సూర్న శ్రీకాంత్‌, మాజీ సర్పంచ్‌ భిక్షపతి, నాయకులు కరుణాకర్‌, పాపయ్య, శ్రీనివాస్‌, సురేశ్‌రెడ్డి, ఎల్లయ్య, విద్యాసాగర్‌, నర్సింహులు, మధు, కలీంపాషా, రాకేశ్‌ తదితరులు పాల్గొన్నారు.


హామీల అమలులో కాంగ్రెస్‌ విఫలం

షాబాద్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కొడంగల్‌ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో ఈ నెల 17న రైతు ధర్నా నిర్వహించనున్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ హాజరుకానున్న సభా స్థలాన్ని సోమవారం బీఆర్‌ఎస్‌ యువ నేతలు పట్నం అవినాశ్‌రెడ్డి, పట్లోళ్ల కార్తీక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వ హామీలను పతంగులపై ముద్రించి ప్రజలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. రైతు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నీటి వ్యథ!

ఏళ్లుగా తాగునీటి కష్టాలు
- బావి నీరే దిక్కు
- నీటి మార్గం అధ్వానం
- గుట్టలు ఎక్కలేక జనం అవస్థలు
- దుగనాయక్‌ తండా వాసుల దుస్థితి ఇదీ..


బావి నుంచి నీటిని తోడుతున్న మహిళలు


దుగనాయక్‌ తండా రోడ్డు పరిస్థితి


నీటితో గుట్టపై ఎక్కుతున్న గిరిజనులు

కల్హేర్‌(నారాయణఖేడ్‌): నీటి వసతి లేక ఎత్తైన గుట్ట కిందిభాగంలో ఉన్న పురాతన బావి నుంచి నీటిని తెచ్చుకుని తాగుతున్నారు. ఆపై తండాకు రోడ్డు సౌకర్యం లేదు.. ఏళ్ల తరబడిగా సమస్య తిష్టవేసుకని ఉన్నాయి. మిషన్‌ భగీరథ నీరు కూడా చేరడం లేదు. బోర్లు తవ్వినా ఫలితం దక్కలేదు. ఉన్న మినీ ట్యాంక్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. అయితే ప్రత్యామ్నాయంగా గుట్ట కింద ఉన్న పురాతన బావిలో విద్యుత్‌ మోటార్‌ ఏర్పాటు చేశారు. తండాలో ఉన్నా మినీ వాటర్‌ ట్యాంక్‌ల్లో పైపులైన్‌ కనెక్షన్‌ ఇచ్చారు. బావి నుంచి ఎత్తు ప్రదేశంలో నీటి సరఫరా చేసేందుకు అంతరాయం తలెత్తుతుంది. తరుచుగా బావిలో ఉన్నా మోటార్‌ కాలిపోతుంది. ఫలితంగా గిరిజనులు గుట్ట కింద ఉన్నా బావి వద్దకే పరుగులు పెట్టాల్సి పరిస్థితి ఏర్పడుతోంది. నీటి కోసం బావి వద్దకు వెళ్లేందుకు గుట్ట ఎక్కడం, దిగడంతో మోకాళ్ల నొప్పుల బారిన పడుతున్నారు. బావిలో ఉన్నా నీటి వాడకం చేయడం, తాగడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. సిర్గాపూర్‌ మండలం పోట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దుగనాయక్‌ తండా గిరిజనుల దుస్థితి ఇదీ.

రోడ్డు లేక అవస్థలు..

పోట్‌పల్లి నుంచి దుగనాయక్‌ తండా మార్గంలో మట్టి రోడ్డుపై కాలినడక నడవలేని పరిస్థితి. అత్యవసర సమయంలో తండాకు అంబులెన్స్‌, ద్విచక్ర వాహనాలు కూడా రాని దుస్థితి. వైద్యం కోసం తరలించలేక నిస్సహాయ స్థితిలో ప్రాణలు పోగొట్టుకున్న ఘటనలు కోకొల్లలు. నీటి సమస్య, రోడ్డు సమస్య పరిష్కరం కోసం చర్యలు తీసుకోవాలని తండా వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

దుగనాయక్‌ తండా వివరాలు	
జనాభా	390 మంది
ఓటర్లు	198 మంది
గృహాలు	52
పాఠశాల	1
అంగాన్‌వాడీ	1

మోకాళ్ల నొప్పులు వస్తున్నాయి



రోజు బావి నుంచి నీళ్లు తెచ్చుకుని తాగుతున్నాం. గుట్ట కింద నుంచి బిందెలు ఎత్తుకుని వస్తే మోకాళ్ల నొప్పులు వస్తున్నాయి. చాలా బాధ పడుతున్నాం.

–కమలాబాయి, దుగనాయక్‌ తండా

మైనర్లకు వాహనాలిస్తే కేసులు

త్రీ టౌన్‌ సీఐ విద్యాసాగర్‌


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కొండపాక(గజ్వేల్‌): మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానిపై సైతం కేసు నమోదు చేస్తామంటూ త్రీ టౌన్‌ సీఐ విద్యాసాగర్‌ హెచ్చరించారు. మండలంలోని దుద్దెడ.. రాజీవ్‌ రహదారిపై జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్‌, రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రైవింగ్‌ లైసెన్సు లేకుండా వాహనాలు నడరాదన్నారు. నడిపేటప్పుడు కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుంటే ప్రమాదాలు జరగవన్నారు. త్రిపుల్‌ రైడింగ్‌, రాంగ్‌ రూట్లో డ్రైవింగ్‌ చేయవద్దన్నారు. సెల్‌ఫోన్‌ నడుపుతూ వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ అవకాశాలుంటాయన్నారు. మైనర్లు బైక్‌లు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రయాణికులు, వాహనదారులు, గ్రామస్తులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌ ఏర్పాటు చేయాల్సిందే


శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న డివిజన్‌ సాధనసమితి నాయకులు

దుబ్బాక: దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ ఏర్పాటుకు కృషి చేయాలని డివిజన్‌ సాధన సమితి కోరారు. సోమవారం కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి సమితి సభ్యులు వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాకను డివిజన్‌ ఏర్పాటు చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. దుబ్బాకతో పాటు మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి, తొగుట, దౌల్తాబాద్‌, రాయపోల్‌ మండలాలతో డివిజన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి.. సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి డివిజన్‌ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మాడబోయిన శ్రీకాంత్‌, రాజేశ్‌, సంతోశ్‌, అరవింద్‌, యాదగిరి తదితరులు ఉన్నారు.

మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాలి

రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

కొడంగల్‌: మున్నూరు కాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మున్నూరు కాపు రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు, కవి, అధ్యాత్మిక వేత్త భాస్కర యోగి అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో నియోజకవర్గ పరిధిలోని కొడంగల్‌, దౌల్తాబాద్‌, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలకు చెందిన మున్నూరు కాపు కుల బంధువుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామ కమిటీలు, మండల కమిటీలు, తాలూకా కమిటీల ఆధ్వర్యంలో 2025 సంవత్సరం క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మున్నూరు కాపు కుల బంధువులు ఐకమత్యంగా ఉండాలన్నారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. రాష్ట్ర మహాసభ ద్వారా విద్యార్థులకు కాచిగూడలో హాస్టల్‌ వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉపకార వేతనాలు, మెరిట్‌ స్కాలర్‌ షిప్‌లు, పాఠ్యపుస్తకాలు ఇస్తున్నట్లు వివరించారు. పేదింటిలో పెళ్లికి పుస్తె మట్టెలు ఇస్తున్నట్లు చెప్పారు. రాజకీయంగా ఎదగడానికి ప్రతీ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్‌కుమార్‌, ప్రకాశ్‌, నాగరాజు, సత్యనారాయణ, ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు పెద్ది పెంటయ్య, ఉపాధ్యక్షుడు కోరమోని వెంకటయ్య, బుచ్చిరెడ్డి, తాండూరు మార్కెట్‌ కమిటీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దయాకర్‌రెడ్డి, కొడంగల్‌ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్‌, ప్రధాన కార్యదర్శి మల్లయ్య, కోశాధికారి నర్సిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్‌, బిచ్చప్ప, అరిగె ఓం ప్రకాశ్‌, శ్యాం సుందర్‌, నరేష్‌, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంత ప్రసాద్‌, యువక మండలి అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు శేఖర్‌, శ్రీనివాస్‌, గౌరీశంకర్‌, అరుణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి క్రికెట్‌ టోర్నీ సంబురం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వెంకట్‌


మోతె క్రికెట్‌ టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు

మిరుదొడ్డి(దుబ్బాక): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి మండల పరిధిలో జరుగుతున్న క్రికెట్‌ టోర్నీ సంబురాలు అంబరాన్నంటుతున్నాయి. మండల పరిధిలోని ధర్మారంలో సోమవారం డీపీఎల్‌ క్రికెట్‌ టోర్నీని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి ప్రారంభించారు. నైపుణ్య ఆర్గనైజేషన్‌ చైర్మన్‌ ఐలయ్య నేతృత్వంలో ఈ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. అలాగే అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలో మాజీ సర్పంచ్‌ కాలేరు శ్రీనివాస్‌ నేతృత్వంలో క్రికెట్‌ టోర్నీని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డి ప్రారంభించారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు..

హుస్నాబాద్‌: క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్‌ అన్నారు. హుస్నాబాద్‌ ప్రీమియంలీగ్‌ ఆధ్వర్యంలో 20-20 క్రికెట్‌ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రికెట్‌లో రాణించి భవిష్యత్‌లో జిల్లా, రాష్ట్ర పోటీల్లో ఆడాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోవిందు రవి, మ్యాదరబోయిన వేణు, కాంగ్రెస్‌ నాయకుడు అక్కు శ్రీనివాస్‌, నిర్వాహకులు దిలీప్‌ సింగ్‌, రాకేశ్‌, శ్రీధర్‌ తదితరులు ఉన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాగయ్య

కుల్కచర్ల: జాతీయ భావాలను పెంపొందించుకోవడంతో పాటుగా సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్‌ అఖిల భారత కార్యకారిణి సభ్యుడు భాగయ్య అన్నారు. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో కుల్కచర్ల శాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటుగా వ్యవసాయంలోనూ అలనాటి పద్ధతులను పాటించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి, ఆరోగ్యమైన పంట లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్‌ సంఘ నాయకులు ప్రహ్లాదరావు, ఎల్లయ్య, ఆంజనేయులు, రవి, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం


జాతరలో బోనాలు చేస్తున్న మహిళలు (ఫైల్‌)

హుస్నాబాద్‌రూరల్‌: పొట్లపల్లిలో మల్లికార్జునుడి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. సంక్రాంతి సంబురాలకు సన్నద్ధమైంది. సంక్రాంతిని పురస్కరించుకొని వేడుకలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. పండగ రోజున ఇంటింటా మల్లన్న బోనాలు చేసి మహిళలు స్వామికి మొక్కులు సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా రాత్రి స్వామివారి పట్నాలు వేస్తారు. ఈ పట్నాలను తిలకించేందుకు కోహెడ, చిగురుమామిడి, అక్కన్నపేట మండలాలు, కరీంనగర్‌ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు. రాత్రిపూట ఆలయం ఆవరణలోనే నిద్రించి తెల్లవారుజామున జరిగే అగ్నిగుండాలను తిలకిస్తారు. మూడు రోజులుగా నిర్వహించే ఈ ఉత్సవాల కోసం భక్తులరాక ప్రతియేటా పెరుగుతూ వస్తోంది. నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

కానిస్టేబుల్‌ నిర్వాకం.. వృద్ధుడికి ప్రాణాపాయం

- ఫోన్‌ మాట్లాడుతూ వెనక నుంచి బైక్‌తో ఢీ
- చెవిలోంచి రక్తస్రావం


కానిస్టేబుల్‌ బైక్‌ ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయిన వృద్ధుడు నర్సయ్య

ధారూరు: ఓ కానిస్టేబుల్‌ నిర్వాకం వృద్ధుడి ప్రాణాల మీదకు తెచ్చింది. ఈ ఘటన మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట సోమవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం.. దోర్నాల్‌ గ్రామానికి చెందిన తానెం నర్సయ్య(65) పని నిమిత్తం ఎస్‌బీఐ (బ్యాంకు)కి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఫోన్‌ మాట్లాడుతూ వెనక నుంచి బైక్‌ వచ్చిన కానిస్టేబుల్‌ అనంతయ్య.. వృద్ధుడిని ఢీకొట్టాడు. దీంతో అతని తలకు బలమైన గాయమైంది. చెవిలోంచి రక్తస్రావం కావడంతో పక్కనే ఉన్న వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో వికారాబాద్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కానిస్టేబుల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని క్షతగాత్రుడికి కొడుకు సత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్‌ మాత్రం తనదేం తప్పు లేదని, ఆయనే పడిపోయాడని చెప్పి వెళ్లిపోయాడు. అయితే కానిస్టేబుల్‌ బైక్‌పై వస్తూ, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నాడని, వృద్ధుడిని గమనించకుండా ఢీ కొట్టాడని అక్కడున్న వారు తెలిపారు. వాస్తవం తెలియాలంటే పెట్రోల్‌ పంపు, వైన్‌షాప్‌, ఎస్‌బీఐ వద్ద ఉన్నసీసీ కెమెరాలను పరిశీలిస్తే.. తప్పు ఎవరిదో తెలుస్తుందన్నారు.

మాదిగలంతా డప్పుతో రావాలి

- ఎమ్మార్పీఎస్‌ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎస్‌వై అశోక్‌
- రేగడి మైలారంలో 'వేల గొంతులు–లక్ష డప్పులు' రథయాత్ర ప్రారంభం

బొంరాస్‌పేట: మాదిగ ఉపకులాల సామాజిక న్యాయం కోసం మందకృష్ణ మాదిగ చేపట్టిన పోరాటానికి డప్పులతో రావాలని ఎమ్మార్పీఎస్‌ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎస్‌వై అశోక్‌ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని రేగడిమైలారంలో 'వేల గొంతులు–లక్ష డప్పులు'రథయాత్ర ప్రారంభించారు. ముందుగా మాజీ ఎంపీ మందా జగన్నాథం మాదిగకు, మాదిగ అమరులకు నివాళి అర్పించారు. అనంతరం అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి రథయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర మండల పరిధిలోని చౌదర్‌పల్లి, నాందార్‌పూర్‌, తుంకిమెట్ల గ్రామాల మీదుగా సాగింది. ఫిబ్రవరి7న హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతులు–లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

త్వరలో కొడంగల్‌కు మందకృష్ణ

జిల్లా స్థాయి రథయాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంకిమెట్లలో విలేకరుల సమావేశంలో చెప్పారు. కొడంగల్‌ నియోజకవర్గ కేంద్రంలో జిల్లా స్థాయి బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని వివరించారు. మండలాల వారీగా పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్‌ నాయకులు రాంచందర్‌, స్వామి, వికారాబాద్‌ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ, ప్రధాన కార్యదర్శి సుభాశ్‌, ఉపాధ్యక్షుడు మల్కప్ప, మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్‌, అరుణోదయ అనిత, రమేశ్‌బాబు, ఎరన్‌పల్లి శ్రీనివాస్‌, దాసరి చంద్రప్ప, గ్రామాల అధ్యక్షుడు యేసు, బందెప్ప, వెంకటయ్య, తదితరులున్నారు.



మనసు దోచే.. మామిడి పూత

మద్దూరు, లద్నూర్‌ గ్రామాల మధ్య ఓ రైతు పొలంలో మామిడి చెట్టు పూత కంటికి ఇంపుగా కనిపిస్తోంది. దీంతో రహదారి వెంట వెళ్లే ప్రయాణికులు, పాదచారుల మనసు దోచేస్తోంది. ఆపై చెట్టు వద్దకు వెళ్లి ఫొటోలు, సెల్ఫీలు సంబర పడిపోతున్నారు.

–మద్దూరు(హుస్నాబాద్‌)

సంక్రాంతి వెనుక సైన్స్‌

- పండుగలో ఔషధ నిధి మిళితం
- మూడు రోజులపాటు సందడే

సంక్రాంతి పండుగను తెలుగు ప్రజలు విశిష్టంగా జరుపుకుంటారు. భోగితో మొదలైన ఈ పండుగ ముక్కనుమతో ముగుస్తుంది. భోగి సందర్భంగా చలితీవ్రతను తట్టుకునేందుకు తెల్లవారు జామునే లేచి భోగి మంటలు వేస్తారు. సంక్రాంతి రోజున పిండివంటలు చేసుకోవడం, కూరగాయలు వాయినాలు ఇస్తుంటారు. కనుమ రోజున పశువులను పూజిస్తారు. పండుగ వెనుక దాగి ఉన్న సైన్స్‌ పరమార్థంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

షాబాద్‌: మన దేశంలో ప్రత్యేకతలకు పెట్టింది పేరు తెలుగు పండుగలు. ప్రకృతిలో ఉండే అనేక సంస్కృతులు, ఔషధాల గొప్పతనాన్ని చాటుతుంటాయి. ఒక్కో పండుగకు ఒక్కో శాస్త్రీయ కోణం ముడిపడి ఉంటుంది. అందులో అతి ప్రత్యేకమైనది సంక్రాంతి పండుగ. సూర్యుడు మకరరాశిలో మారే కాలంలో బంతి, చామంతి పూలు, రేగిపండ్లు, మిరపపళ్లు పుష్కలంగా దొరుకుతాయి. ముంగిళ్లలో రంగులు, రంగవల్లులు వేసి వాటిని ఆవు పేడతో గొబ్బెమ్మలు, గరికపోచలు, పిండి కొమ్ములు (ఉత్తరేణి), తంగేడు కొమ్ములు, వాటికి పసుపు అంటించి పువ్వులతో అలంకరిస్తారు. కొన్ని ప్రాంతాల్లో ముగ్గుల్లో సజ్జలు, జొన్నలు, బియ్యం పిండిని వాడుతారు. సంక్రాంతి ముందు రోజు భోగి నాడు మూడేళ్ల లోపు పిల్లలకు గ్రహణ పీడలు, శని తొలగి సకల ఐశ్వర్యాలతో ఉండాలని కోరుతూ రేగిపండ్లు పోస్తారు. గొబ్బెమ్మల చుట్టూ ధాన్యాలు పోసి పశుపక్ష్యాదులకు ఆహారంగా అందిస్తారు. మరుసటి రోజు సంకాంత్రి నాడు కొత్త బియ్యం, బెల్లం, నువ్వులతో పులగం వండుకుంటారు. ఇలా సంకాంత్రి పండుగ సమయంలో చేసే పనులన్నింటి వెనుక శాస్త్రీయ కోణం దాగి ఉంది. పూర్వకాలంలో మన పెద్దలు రాబోయే వైరస్‌లు, వ్యాధులను ముందుగా గ్రహించి వాటికి అనుగుణంగా ముందస్తుగా జాగ్రత్తలు పాటించేవారు. అలా మన పెద్దలు ముందస్తుగా పాటించే జాగ్రత్తలను పండుగలు, పర్వదినాన్ని బట్టి ప్రకృతిలోని ఔషధాలు, పదార్థాలను వినియోగించేవారు. అలాగే సంక్రాంతి పండుగలో సైతం అనేక ప్రత్యేకమైన ఔషధాలు, సహజసిద్ధ పదార్థాలను వినియోగించేవారు. ప్రకృతిలో లభించే వరి, శనగలు, మినుములు, నువ్వులు, సజ్జలు, పెసర్లు, బొబ్బర్లు, ఉలవలు వంటి రకరకాల ఆహార పదార్థాల్లో అనేక ఔషధ గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.

ఆరోగ్యం

సంక్రాంతి పండుగకు నువ్వులు, బెల్లం, రేగిపండ్లు, గరిక తదితరాలు ఔషధాలతో కూడనవి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

దాక్టర్‌ విజయలక్ష్మి,
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, షాబాద్‌

గొబ్బెమ్మలు
- ఆవుపేడతో తయారు చేయడంతో క్రిమిసంహారకంగా పనిచేస్తుంది.
- ప్రకృతి కాలుష్య నివారిణి.
- ఉష్ణ ఉత్పత్తి ఉపయోగాలు అధికం.

పొంగలి
- సంక్రాంతి నాడు చేసే పొంగలికి బియ్యం, నువ్వులు, బెల్లం ఉపయోగిస్తారు. దీంతో పాటు పండుగ రోజు పిండితో అరిసెలు చేస్తారు. వీటిలోనూ పోషక విలువలు అధికంగా ఉంటాయి.

రేగి పండ్లు
- వీటిలో ఔషధగుణాలు అధికం
- వాతం, మధుమేహం, మూల వ్యాధి నివారణి
- రక్తశుద్ధి, ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది.
- శరీరానికి అవసరమైన వేడి పుట్టించడంతో పాటు చలువ చేస్తుంది.
- విటమిన్‌–సి పుష్కలంగా లభిస్తుంది.

నువ్వులు
- శరీరంలో ఉష్ణ ఉత్పత్తిని పెంచుతాయి.
- ఔషధ గుణం ఉంటుంది.
- మూత్ర వ్యాధులను తొలగిస్తుంది
- ఎముకల్లో మజ్జ ఉత్పత్తిలో ప్రధాన పాత్ర వహిస్తుంది.

బియ్యం
- కడిగిన బియ్యం నీటిని పంచదారతో సేవిస్తే మూత్ర విసర్జన సాఫీగా ఉంటుంది.
- దప్పిక తగ్గుతుంది. వేసవిలో వడదెబ్బ నుంచి రక్షిస్తుంది.
- త్రిదోషహారిణిగా పనిచేస్తుంది.
- శరీరానికి కార్బోహైడ్రేట్లు అధికంగా అందుతాయి.

బెల్లం
- రక్తం వృద్ధి అయ్యేలా పనిచేస్తుంది.
- శరీరంలో ఖనిజ లవణాలను పెంచుతుంది.
- శరీరాన్ని కాంతిమయంగా చేస్తుంది.
- కోప, తాపాలను తాగిస్తుంది.
- సర్వ దోష లక్షణాలను నిరారిస్తుంది.



పిండి కొమ్ములు
- జీర్ణ వ్యాధులు, త్రిదోశ, ఉదరవ్యాధుల నివారిణి.
- పైత్యరసం ఉత్పత్తిలో ప్రాత వహిస్తుంది.
- రక్తం వృద్ధి చేస్తుంది.

గరక
- పచ్చి గరకను మెత్తగా నూరి గాయాలపై పూస్తే మానిపోతాయి.
- ప్రకృతి సమతుల్యతను కాపాడుతుంది.
- దగ్గు, ఆయసం, మలబద్ధకాన్ని నివారిస్తుంది.